ప్రజాశక్తి
బుధవారం 21 మే 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఆంధ్రకేసరి స్ఫూర్తితో
ముందుకు సాగుదాం..

- కలెక్టర్ తమీమ్అన్సారియా
- టంగుటూరు ప్రకాశం పంతులుకి ఘన నివాళి

ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. ప్రకాశం పంతులు వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఆయన విగ్రహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు, బిఎన్ విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనమడు టంగుటూరి సంతోష్ కుమార్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమడు టంగుటూరి సంతోష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేసు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యా శాఖాధికారి కిరణ్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, ప్రకాశం భవనంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు లేకుండా..
జిల్లా అభివృద్ధి ఎలా.?

- సమావేశాలు, సమీక్షలతో సరి
- మొక్కుబడిగా జరుగుతున్న డిఆర్‌సిలు
- నేడు డిఆర్‌సి సమావేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే సమగ్ర ప్రణాళికతో పాటు నిధులు కూడా అవసరం. జిల్లా అభివృద్ధి మండలి (డిఆర్‌సి) సమావేశాల్లో ఎన్ని ప్రణాళికలు రచించినా తదనుగుణంగా నిధులు విడుదల కాకపోతే ఫలితం శూన్యం. ఈ కారణంగానే జిల్లా ఏర్పడిన గత మూడున్నరేళ్ల కాలంలో జిల్లా అభివృద్ధి మండలి(డిఆర్‌సి) సమావేశాలు ఎన్ని జరిగినా మంత్రులు ఎన్ని హామీలు ఇచ్చినా తదనుగుణంగా నిధులు మాత్రం మంజూరు కాకపోవడంతో డిఆర్‌సి సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్న పరిస్థితి తలెత్తింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా జిల్లా అభివృద్ధికి కావలసిన నిధులు విడుదల కష్టంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మూడోసారి జరగనున్న డిఆర్‌సి సమావేశం ద్వారా జిల్లాకు మేలు జరుగుతుందా.? అనే ప్రశ్న తలెత్తుతుంది. జిల్లా ఏర్పడిన అనంతరం గత వైసిపి ప్రభుత్వ హయాంలో మూడు పర్యాయాలు మాత్రమే డిఆర్‌సి సమావేశాలు జరిగాయి. కానీ ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు నిధులు విడుదలయిన దాఖలాలు లేవు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంది.

నూతనంగా ఏర్పడిన జిల్లాలో సమీకృత జిల్లా కార్యాలయ భవనాల కోసం నిధులు అవసరం. అలానే జిల్లా సమగ్రాభివృద్ధి చెందాలంటే రవాణా, విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు లాంటి రంగాలపై దృష్టి పెట్టాలి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి. జిల్లా కేంద్రంలో ▶ 2లో

రాస్తారోకో చేస్తున్న పొగాకు రైతులు

రైతులను మోసం చేసిన
కంపెనీలపై కేసులు పెట్టాలి

3లో ▶

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు
ఉద్యమం ఆగదు..

3లో ▶

విహారంలో విషాదం..!

- టైరు పగిలి కారు బోల్తా
- ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి
- చికిత్స పొందుతూ.. మరో విద్యార్థి మృతి
- ఆరుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు

ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అజయ్, కార్తీక్, నాయక్ (ఫైల్)

ప్రజాశక్తి-చీరాల

విహారయాత్రకు వచ్చి.. తిరిగి వెళుతుండగా.. కారు ముందు టైరు పగిలిపోవడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన చీరాల మండలం, వాడరేవు గ్రామం, మెడికల్ కాలేజీ సమీపంలో మంగళవారం జరిగింది. మృతుల స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా, గుంటూరు వసంత రాయపురానికి చెందిన రోహిత్ నాయక్(19), గుంటూరు టి.నగర్‌లో నివాసం ఉంటున్న కార్తీక్(18), గుంటూరుకు చెందిన అజయ్ (24) నల్లపాడులోని ఎంబిబిఎస్ కళాశాలలో చదువుతున్నారు. అయితే వీరందరూ స్నేహితులు కావడంతో అదే ఎంబిబీఎస్ కళాశాలలో చదువుతున్న దేవదత్త, శామ్యూల్, హోసన్న, విష్ణు శశాంత్, తనుష్ వెంకట నాగసాయి, అచ్చుత ప్రనేష్.. మరో విద్యార్థి.. వీరందరూ కలిసి వాడరేవు సముద్రంలో సరదాగా సేద తీరేందుకు మంగళవారం మధ్యాహ్నం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో సముద్ర స్నానం ముగించుకొని తిరిగి గుంటూరు బయలుదేరేందుకు కారులో ప్రయాణం చేస్తున్నారు. అయితే తాము ఇంత దూరం వచ్చాము కదా ▶ 2లో

రాజంపల్లి పంచాయతీలో
రూ.29.47 లక్షలు దుర్వినియోగం

- ఉపసర్పంచి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన డిఎల్‌పిలో అధికారి
- నిధులు దుర్వినియోగం చేసినట్లు తేలడంతో చెక్‌పవర్ రద్దు చేసిన డిపిఒ

ప్రజాశక్తి-దర్శి

రాజంపల్లి పంచాయతీలో రూ.29.47 లక్షలు నిధులను సర్పంచి దుర్వినియోగం చేశారు. చట్ట విరుద్ధంగా పంచాయతీ నిధులను డ్రా చేసి దారి మళ్లించినట్లు అధికారులు విచారణలో గుర్తించారు. దీంతో సర్పంచి చెక్ పవర్‌ను మూడు నెలల పాటు రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకటనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచి వనం అన్నపూర్ణ పంచాయతీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా 15వ ఆర్థిక సంఘం నిధులను డ్రా చేసి సర్పంచి కుమారుడు, ఇతర వ్యక్తుల ఖాతాలకు మళ్లించినట్లుగా ఉపసర్పంచి వజ్జా నాగమణి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కనిగిరి డిఎల్‌పిఓ హనుమంతరావును విచారణ అధికారిగా నియమించారు. ఉపసర్పంచి ఫిర్యాదుపై విచారణ చేపట్టిన డిఎల్‌పిఓ నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. డివిజనల్ పంచాయతీ అధికారి ఆమోదం లేకుండానే నిధులు డ్రా చేశారని తేల్చారు. 2021-22లో రూ.6.85 లక్షలు, 2022-23లో రూ.10.87 లక్షలు, 2023-24లో రూ.6.18 లక్షలు, 2024-25లో రూ.5.64 లక్షలు మొత్తం రూ.29.47లక్షలు దుర్వినియోగం అయినట్లు తేల్చారు. విచారణ అధికారి నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి పంపారు. దీంతో డిపిఓ నివేదిక ఆధారంగా సర్పంచి చెక్‌పవర్‌ను మూడు నెలల పాటు రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని రాస్తారోకో

ప్రజాశక్తి-మార్కాపురం

కార్మికులకు తీవ్ర స్థాయిలో నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరింది. అసంఘటిత కార్మికులకు సమర్థవంతమైన చట్టం చేయాలని, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు వర్తింపచేయాలని కోరుతూ మార్కాపురం పట్టణ పరిధిలోని పారిశ్రామికవాడలో జాతీయ రహదారి 565పై మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేందుకు బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేస్తోందని అన్నారు. కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా తీసుకురావటాన్ని వ్యతిరేకించారు. కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టాన్ని, సమ్మె చేసే హక్కును, హరించే విధంగా, కార్మికులను యజమానులకు బానిసలుగా తయారు చేసే చర్యలు మానుకోవాలని కోరారు. జాతి సంపద అయిన ప్రభుత్వ రంగ సంస్థలు బిఎస్ఎన్ఎల్, లైఫ్ ఇన్సూరెన్స్, పోస్టల్, రైల్వే, స్టీల్ ప్లాంట్ సంస్థలను కార్పొరేటర్ సంస్థలకు కట్టబెట్టి, కార్మికులకు ఉపాధి దూరం చేసే చర్యలకు మోడీ ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ మానుకోవాలని కోరారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయించడం మానుకోవాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న వారందరినీ కార్మికులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు డి సోమయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి పి రూబెన్, మండల నాయకులు జె నాగరాజు, బాల శేషయ్య, వెంకటేశ్వరరెడ్డి, రాములు, ప్రకాశం, శార తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు పట్టణం గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం లేబర్ కోడ్స్ రద్దు చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు డి థామస్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికుల 29 కార్మిక చట్టాలను మార్పుచేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకురావడంతో కార్మికులు బానిసలుగా మారతారన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని జూలై 9వ తేదీన కార్మికులు తలపెట్టిన జాతీయ కార్మిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం మురళి, కే బాలయ్య, ఏసురత్నం, చంటి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో కార్మికుల నిరసన

గృహ నిర్మాణాలపై ఎంపీడీవో సమీక్ష

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని గృహ నిర్మాణాలను వేగవంతం చేయడంపై ఎంపీడీవో డి సురేష్‌బాబు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్ డిప్యూటీ ఇంజనీర్ పి చెన్నరాయుడు, మండల హౌసింగ్ ఏఈ వి కిరణ్‌రాజులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ లబ్ధిదారులకు గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల అదనపు నిధులను విడుదల చేసిందన్నారు. లబ్ధిదారులు ఆయా గృహాలను మరింతగా వేగవంతంగా నిర్మించుకునేందుకు వారిని చైతన్యపరచాలని కోరారు. అంతకమునుపు హౌసింగ్ శాఖ అధికారులు సంతనూతలపాడు చంద్రపాలెం లే అవుట్‌లను పరిశీలించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతంపై లబ్ధిదారులను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

విహారంలో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

చేపలు తీసుకొని ఇంటికి వెళదామని భావించి వాడరేవు పెట్రోల్ బంకు వద్ద యూటర్న్ తీసుకొని తీరం వద్దకు వేగంగా కారులో ప్రయాణం చేస్తున్నారు. అయితే మెడికల్ కళాశాల సమీపంలో కారు వెనక చక్రం ఒక్కసారిగా పగిలిపోవడంతో వేగంతో ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందిలో ఇద్దరు విద్యార్థులు కార్తీక్, రోహిత్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఆ పాటికే తీవ్రంగా గాయపడిన అజయ్‌ను క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అజయ్ చికిత్స పొందుతూ ఏరియా వైద్యశాలలో మతి చెందాడు. మిగిలిన విద్యార్థులలో ముగ్గురుకు తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న డి.ఎస్.పి మోయిన్, ఈపురిపాలెం ఎస్సై చంద్రశేఖర్ సంఘటనాస్థలానికి చేరుకొని ప్రమాద తీరును, మృతదేహాలను పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఒకటో పట్టణ సీఐ సుబ్బారావు ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు సేకరించారు.

యూటర్న్ తీసుకోవడంతో ప్రమాదం
డీఎస్పీ మోయిన్

సముద్ర స్నానం ముగించుకొని గుంటూరు వెళుతున్న క్రమంలో వాడరేవు నుండి బయలుదేరి రెండు కిలోమీటర్లు ప్రయాణించి సముద్రానికి మరలా యూటర్న్ తీసుకొని చేపల కోసం వెళుతుండగా ప్రమాదవశాత్తూ టైరు పగిలిపోవడంతో ప్రమాదం జరిగిందని డీఎస్పీ మోయిన్ అన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మరణించారని తెలిపారు. వాడరేవు తీర ప్రాంతానికి ప్రయాణించే పర్యాటకులు వాహనాలను పూర్తిగా కండిషన్లో, ఉందో లేదో సరిచేసుకొని ప్రయాణించాలని కోరారు. వేగంగా ప్రయాణించకుండా సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోవాలన్నారు.

నిధులు లేకుండా..
జిల్లా అభివృద్ధి ఎలా.?

(మొదటిపేజీ తరువాయి)

రూ.550 కోట్లతో మెడికల్ కళాశాల, 300 పడకలతో బోధనాసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాల,నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు పునాదుల్లోనే ఆగిపోయాయి. అన్ని సౌకర్యాలతో జిల్లా వైద్యశాల ఏర్పాటు కావాల్సి ఉంది. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. కానీ అమలుకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా ఈ పనులు పూర్తిచేయాల్సి ఉంది. కానీ దీని ఊసే లేకపోయింది. జిల్లాలోని నిజాంపట్నం వద్ద రూ.451 కోట్ల అంచనాలతో నిర్మాణం చేపట్టిన ఫిషింగ్ హార్బర్ పనులు అరకొరగా సాగుతున్నాయి. చీరాల వాడరేవులో రూ.450 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరగాల్సి ఉంది. దీన్ని అటకెక్కించారు. నిజాంపట్నం దిండి వద్ద సమీకృత ఆక్వా పార్కు నిర్మాణం ఎప్పటికి జరుగుతుందో అర్థం కాకుండా ఉంది. రెండు హార్బర్లు, ఆక్వా పార్కు నిర్మాణాలు జరిగితే ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. జిల్లాలో 103 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. సూర్యలంక నుంచి వాడరేవు, రామాపురం, చినగంజాం వరకు తీరంలో పర్యాటక రంగం అభివద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దష్టి పెట్టాల్సి ఉంది. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు కానీ నిధులు మంజూరయిన పరిస్థితి లేదు.

జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు మౌళిక వసతులు కల్పించి, చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు కృషి జరగాలి. చీరాలలో చేనేత పార్కు నిర్మాణం చేపట్టి చేనేత వత్తిలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. గడచిన కాలమంతా పంట కాలువలు, డ్రైన్లలో పూడికలను తీయలేదు. కూటమి ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించారు గానీ పూర్తి స్థాయిలో పనులు జరుగుతున్న పరిస్థితి లేదు. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేసి వినియోగంలోకి తేవాల్సి ఉంది. గుంటూరు ఛానల్ విస్తరణ అనేది ప్రకటనలకే పరిమితమైంది. పల్లె పండుగ అంటూ రహదారుల అభివృద్ధి పనులు చేపట్టారు. గత డిసెంబర్ నెల నుంచి నేటికీ బిల్లులు విడుదల కాలేదు. అభివృద్ధి పనులు ముందుకు సాగాలంటే నిధులు విడుదల అవుతుంటేనే అది సాధ్యం. జిల్లా పరిధిలో ఉన్న 92 ఎత్తిపోతల పథకాల కింద 1.07 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ పథకాల మరమ్మతులు, శాశ్వత సమస్యల పరిష్కారం కోసం నిధులు కావాలి. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటి నీరు సరఫరా చేయడానికి రూ.3,200 కోట్ల అంచనాలతో కేంద్రానికి నివేదిక పంపారు. ఈ పథకం ఎప్పటికి మంజూరవుతుందో తెలియదు. బర్లీ పొగాకు రైతులు తమ పంట కొనేవారు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లా అభివృద్ధి, రైతాంగ సమస్యల పరిష్కారం, ఉపాధి హామీ పనుల కల్పన జరగాలి. తక్షణ అంశాలను గుర్తించి అందుకు అనుగుణం గా నిధుల మంజూరుకు మంత్రులు తమవంతు కృషి చేయాల్సి ఉంది.

శిక్షణ పొందుతున్న చిన్నారులు

గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని శాఖ గ్రంథాలయంలో మంగళవారం ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారి కోసం పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం, డ్రాయింగ్ నేర్పించడం వంటి యాక్టివిటీలు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను ఫ్యాకల్టీ జే శ్రీనివాసరావు, గ్రంథపాలకుడు డి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేకంగా ఈరోజు డ్రాయింగ్ గురించి జే శ్రీనివాసరావు విద్యార్థులకు శిక్షణనందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KOTAPATI LAKSHMI** (Old Name), W/o. **KOTAPATI NARASIMHA RAO**, Resident of H.No.5-120/3, Flat No.402, Galaxy Avenue Apartment, Power Office Opposite Road, 4th Cross, Venkateswara Nagar, Ongole - 523001, Prakasam District , Andhra Pradesh. I have changed my name from **KOTAPATI LAKSHMI** (Old Name) to **KOTAPATI LAKSHAMMA** (New Name) W/o. **KOTAPATI NARASIMHA RAO**, as per affidavit dated 20-05-2025 before public Notary, ONGOLE.

ప్రకటన

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మరియు గ్రామ కాపురస్తుడు షేక్ సుల్తాన్ గారి కుమారుడు మస్తాన్ నాకు ఇచ్చిన సంజాయిషి మేరకు

నా క్లయింట్ నాగులుప్పలపాడుగ్రామములో పూర్వీకుల ఖాళీ స్థలము భాగ పంపిణీ ద్వారా సంక్రమించియున్నది. నా క్లయింట్ ఆ స్థలంలో ఇల్లు కట్టుకొనుటకు బోరు వేయించుకొని, స్థలములో మెరువ తోలించుకుని శంకుస్థాపన చేసుకునే సమయంలో నాక్లయింట్ తెలుసుకొనినది ఏమనగా ఈ స్థలముతో ఎటువంటి సంబంధం లేని షేక్ సైదాబీ వారి కుమారులు హక్కు లేకుండా అమ్ముటకు ప్రయత్నించుచున్నారని తెలిసినది

నా క్లయింట్‌కు సంపూర్ణ హక్కు గల షెడ్యూల్ దాఖలా ఆస్తిని ఎవరైనను అమ్మినను కొనుగోలు చేసిననూ నా క్లయింట్ తీసుకొనుబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యలగుదురని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రీ నాగులుప్పలపాడు గ్రామం సర్వేనెంబర్ 600/1 విస్తీర్ణం 0.07 1/4సెంట్ల స్థలమునకు హద్దులు.

తూర్పు : మీరాసాహెబ్ గారి స్థలము.
దక్షిణం : నాగులుప్పలపాడు నుంచి అమ్మనబ్రోలుకు పోవు దారి,
పడమర : స్కూల్ స్థలము,
ఉత్తరము : దొడ్డవరపు పాటి మీరా సాహెబ్ మరియు షేక్ అజీజ్ స్థలము

ఇట్లు
కనపర్తి నాగేశ్వరరావు
అడ్వకేట్, ఒంగోలు

ప్రజాశక్తి
బుధవారం 21 మే 2025

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. త్రిపురాంతకం మండలంలోని మేడపి వద్ద లారీ అదుపుతప్పి మిద్దెను ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందాడు. మేదరమెట్లలో అతివేగంగా వెళ్తున్న కారు బోల్తా పడటంతో యువకుడు మృతి చెందాడు.

అదుపుతప్పి మిద్దెను ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

అదుపుతప్పి లారీ మిద్దెను ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని మేడపి వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొత్త ముడివేముల గ్రామాన్ని చెందిన ఆవుల వెంకట నారాయణ(33) బాడుగకు లారీ తీసుకొని వినుకొండ నుంచి యర్రగొండపాలెం వైపు బయలుదేరాడు. మేడపి సమీపంలోకి రాగానే అదుపు తప్పి సర్వీస్ రోడ్ పక్కన వున్న 33/11 కెవి విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొట్టింది. అక్కడితో ఆగకుండా సర్వీస్ రోడ్డు ప్రక్కనే ఉన్న దుకాణం వెనుక వున్న పాత మిద్దెలోకి దూసుకుపోయింది. ఈ క్రమంలో మిద్దె స్లాబ్ లారీ కేబిన్‌లోకి దూసుకుపోయింది. దీనితో డ్రైవర్ వెంకట నారాయణ లారీ కేబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తీసేందుకు ప్రయత్నించగా రాకపోవడంతో జాతీయ రహదారి సిబ్బంది క్రేన్ సహాయంతో బయటకు తీశారు. హైవే అంబులెన్సు సిబ్బంది వెంకట నారాయణ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహం వద్ద బంధువులు రోదించడం స్థానికులను కలిచివేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ధ్వంసమైన లారీ

కారు బోల్తా: వ్యక్తి మృతి

బోల్తా పడిన కారు

మేదరమెట్ల: అతివేగం తో వస్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడటంతో ఒకరు మృతి చెందిన సంఘటన మేదరమెట్లలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, కొవ్వలి గ్రామానికి చెందిన ఏడుగురు ప్రయాణికులు తిరుపతి నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. ఈ క్రమంలో మేదరమెట్ల నుంచి గుంటూరు రోడ్డులో అతివేగంగా వెళుతూ అదుపుతప్పి కారు తిరగబడింది. ఈ సంఘటనలో సుంకర నాగరాజు(21) అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ మహమ్మద్ రఫీ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి వైద్యశాలకు తరలించారు.

మృతి చెందిన నాగరాజు

వివరాలు వెల్లడిస్తున్న సిఐ సుబ్బారావు

చోరీకి గురైన ఆభరణాలు స్వాధీనం

రెండు రోజుల వ్యవధిలో కేసు ఛేధించిన పోలీసులు

వివరాలు వెల్లడించిన సిఐ సుబ్బారావు

ప్రజాశక్తి-మార్కాపురం

రెండు రోజుల క్రితం అపహరణకు గురైన రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాల కేసును పోలీసులు ఛేధించారు. మంగళవారం స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ సుబ్బారావు వివరాలు వెల్లడించారు. కొమరోలు గ్రామానికి చెందిన మజ్జారి బాల వెంకటయ్యతో పాటు కుటుంబ సభ్యులు మార్కాపురంలో వివాహ వేడుకలకు ఈ నెల 18వ తేదీన శ్రీశైలం ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కారు. మార్కాపురం బస్టాండుకు చేరుకునేసరికి సాయంత్రం 6:45 గంటలయింది. బస్సు దిగే క్రమంలో వెంట తెచ్చిన బ్యాగుల్లో బంగారు నగల బ్యాగు కనిపించలేదు. ఆ బ్యాగులో 127 గ్రాముల బరువు కలిగిన వివధ రకాల ఆభరణాలు ఉన్నాయి. వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని అంచనా. దీంతో బాధితులు ఆందోళన చెందారు. బస్సులోని ప్రయాణికులు ఓ మహిళ బ్యాగుతో మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో దిగిపోయినట్లు గమనించారు. బాధితుడు మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సిఐ సుబ్బారావు ఆదేశాల మేరకు పట్టణ ఎస్ఐలు ఎం సైదుబాబు, డాక్టర్ ఎం రాజమోహన్ రావుల సారథ్యంలో నిందితురాలి కోసం వేట ప్రారంభించారు. ఆ రహదారిలో దాతల సహకారంతో అమర్చిన సిసి కెమెరాలను పరిశీలించగా ఓ మహిళ బ్యాగుతో దిగడాన్ని గుర్తించారు. ఆ బ్యాగు సొత్తు పోగొట్టుకున్న వ్యక్తులదిగా గుర్తించారు. ఆ మహిళ ఎవరనేది ఆరా తీశారు. జగదీశ్వరి థియేటర్ ప్రాంతానికి చెందిన దూదేకుల హుస్సేన్‌బీగా గుర్తించారు. మంగళవారం ఉదయం ఆమె ఇంటిని పరిశీలించారు. బ్యాగును, అందులోని రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని నిందితురాలిని అరెస్ట్ చేశారు. ఈ చోరీ కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, ఎఎస్ఐ రత్నం, కానిస్టేబుళ్లు షేక్ షరీఫ్, డి.కోటినాయక్‌లను సిఐ సుబ్బారావు అభినందించారు. ఎస్‌పి దామోదర్ పంపిన రివార్డులను అందజేశారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పొన్నలూరు

చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పొన్నలూరులో మంగళవారం జరిగింది. పైరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొడవల్లూరి శేషయ్య (47) పొన్నలూరు చెరువులో చేపలు పట్టుకోవడానికి దిగాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడిపోయి మృతి చెందాడు. మృతుడికి కొడుకు, కుమార్తె ఉన్నారు. స్థానికులు ఎస్ఐ అనుక్‌కు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

మృతి చెందిన శేషయ్య

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-మద్దిపాడు

వ్యక్తి అదృశ్యంపై స్థానిక స్టేషన్లో కేసు నమోదయింది. మండల పరిధిలోని లింగంగుంట గ్రామానికి చెందిన షేక్ కరిముల్లా బాబు 16 సంవత్సరాల నుంచి మతిస్థిమితం లేక ఇంటి నుంచి అప్పుడప్పుడు ఎవరికి చెప్పకుండా వెళ్లి మరల మూడు లేక నాలుగు నెలల తర్వాత ఇంటికి తిరిగి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో 2024 ఆగస్టులో ఇంటి నుంచి బయటకు వెళ్ళాడు కానీ ఇంతవరకు తిరిగి రాలేదు. ఇప్పటి వరకు ఇంటికి వస్తానని చూసిన రాకపోవడంతో కరిముల్లా భార్య మొగల్ జాన్ బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు. ఆచూకీ తెలిస్తే మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కి తెలియజేయాలని సూచించారు.

రైతులను మోసం చేసిన..

కంపెనీలపై కేసులు పెట్టాలి..

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

బొమ్మల సెంటర్లో కంపెనీలకు వ్యతిరేకంగా నినాదాలు

ప్రజాశక్తి-పర్చూరు

నల్లబర్లీ పొగాకుని వెంటనే కొనుగోలు చేయాలని, రైతులను మోసం చేసిన కంపెనీలపై కేసులు పెట్టాలని కోరుతూ పర్చూరులో ఏపీ రైతు సంఘం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో జరిగింది. బొమ్మల సెంటర్లో కూర్చొని కంపెనీలకు వ్యతిరేకంగా పొగాకు రైతులు నినాదాలు చేశారు. బస్సులను ఆపివేశారు. ఈసందర్భంగా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు కష్ణయ్య మాట్లాడుతూ పొగాకుని కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కంపెనీలపై కేసులు పెట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 27వ తేదీన రైతులను మోసం చేసిన పొగాకు కంపెనీల ముందు ఆందోళన చేస్తామని తెలిపారు. పొగాకుని కొనుగోలు చేయని పక్షంలో జూన్ 2వ తేదిన ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పొగాకుతో పాటు మిర్చి, శనగ, మొక్కజొన్న పంటలకు కూడ గిట్టుబాటు ధర లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా అని ఆయన ప్రశ్నించారు. పొగాకు రైతు పరిస్థితి రోజురోజుకి దుర్భరంగా తయారౌతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. పొగాకుని కంపెనీలు కొనుగోలు చేయని పక్షంలో ప్రభుత్వం పొగాకు బోర్డు ద్వారా కాని, మార్క్ ఫెడ్ ద్వారా కాని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి చింతలపూడి గంగయ్య, సిపిఎం నాయకులు మత్తె డేవిడ్, షేక్ రహీం, వణుకూరి శ్రీనివాసరెడ్డి కొల్లా శ్రీనివాసరావు బీ చినదాసు డి పోతురాజు ఎన్ ప్రసాద్ జి శ్రీనివాసరావు ఎస్ కే జహీనుల్లా ఎస్కే రహీం వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు సాహసం ఆదర్శనీయం

టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మంగళవారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో ప్రముఖ వ్యక్తిగా వెలుగొంది ఆంధ్రకేసరిగా కీర్తిప్రతిష్టలు పొందిన ఆ మహనీయుడు మనందరికి స్ఫూర్తి ప్రదాత అన్నారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొని బ్రిటీష్ తుపాకికి గుండెను చూపిన ఆయన సాహసం ఎన్నటికీ మరువలేమన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగనిరతి ఆదర్శవంతమన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేసేంతవరకూ

ఉద్యమం ఆగదు

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఉద్యోగ, కార్మిక, శ్రామిక, రైతాంగ ప్రజల సంక్షేమం కోసం వందేళ్లు శ్రమించి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు ఉద్యమం కొనసాగిస్తామని, సమ్మె తాత్కాలిక వాయిదా మాత్రమే నని, జులై9 న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. దేశావ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా అఖిలపక్ష కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చా, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్మోహన్ , ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, ఎఐయఫ్‌టియు (న్యూ) జిల్లా కార్యదర్శి ఎంఎస్.సాయి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ దేశప్రజలు వందేళ్ల కష్టించి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసి లేబర్ కోడ్స్ అమలుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకూ ఉద్యమం కొనసాగాలని సూచించారు. మోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల దేశం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందన్నారు.నూతన మార్కెటింగ్ చట్టం వల్ల రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర భారత దేశంలో నెలకొన్న పరిస్థితుల వల్ల నేటి సమ్మె తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. జులై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు విషయంలో కేంద్రం చొరవ చూపకుండా, వాటి అమలు ప్రక్రియను రాష్ట్రాలకు బదలాయి స్తున్నట్లు ప్రకటించటం దారుణమన్నారు. బిజెపికి వ్యతిరేకంగా దేశంలోని ఏ రాష్ట్రం నిర్ణయం తీసుకునే శక్తి లేదన్నారు.లేబర్‌కోడ్స్ అమలును తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఆయన హెచ్చరించారు. పరిశ్రమలను కాపాడేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. రామాయపట్నం పోర్ట్, దొనకొండ కారిడార్, నిమ్జ్, వెలిగొండ ప్రాజెక్టుల నిర్మాణంలో పురోగతి లేదని విమర్శించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీం –రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. దీంతో అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ చర్చలేకుండా మూడు వ్యవసాయ నల్ల చట్టాలు అమలుకు ప్రయత్నం చేస్తే 400 రోజుల పాటు ఢిల్లీలో రైతులు పోరాటానికి దిగితే 750 మందిని మోడీ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఉపాధి హామీ పథకం ఎంతగానో తోడ్పడుతుందని నిపుణులు చెబుతుంటే, మోడీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు నిధుల్లో కోత విధిస్తున్నట్లు ఆరోపించారు. ఉపాధి పథకం కింద కూలీలకు 200 రోజులు పని పెంచాలని , రోజుకి రూ.600 రూపాయలు వేతనం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి మాట్లాడుతూ స్కీంవర్కర్ల ను ప్రభుత్వ ఉధ్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.తొలుత మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రకాశం భవనం వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్ ,నాయకులు చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.కల్పన, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు, రాజశేఖర్, దాసరి సుందరం, జార్జి, సారథి తదితరులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును ప్రభుత్వమే కొనాలి..

మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు నాగబోయిన రంగారావు

ప్రజాశక్తి - పంగులూరు

నల్లబర్లి పొగాకును మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ కౌలు రైతు, రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద రైతులు ధర్నా మంగళవారం చేశారు. పొగాకు కొనుగోలు చేయకపోతే తాము భవిష్యత్తులో వ్యవసాయం చేయలేమని రైతులు భీష్మించకుని కూర్చున్నారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నాగబోయిన రంగారావు మాట్లాడుతూ నల్లబర్లి రైతుల సమస్య నుండి తప్పించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. తక్షణమే రైతుల వద్ద ఉన్న నల్లబర్లి పొగాకు మొత్తాన్ని ప్రభుత్వం మార్క్ఫెడ్ ద్వారా గాని, కంపెనీల ద్వారా గాని కొనుగోలు చేయించాలని అన్నారు. కంపెనీల మోసపు మాటలు నమ్మి రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేశారని, ప్రస్తుతం రైతుల దగ్గర ఉన్న పొగాకు డిమాండ్ ఉన్నప్పటికీ కొనకుండా కాలయాపన చేస్తే రైతులు తక్కువ రేట్లకే ఇస్తారని కంపెనీలు కొనుగోలు చేయటం లేదని, ప్రభుత్వం ఈ విషయమై తీవ్రంగా తీసుకొని కొనిపించాలని అన్నారు. బర్లీ పొగాకు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.70 వేల కోట్ల ఆదాయం వస్తుందని అన్నారు. కంపెనీలకు రూ.వేల కోట్ల ఆదాయం వస్తుందని, అలాంటి పొగాకును పండించిన రైతుల పరిస్థితి ప్రభుత్వాలు పట్టించుకోకపో వడం దారుణమని అన్నారు. రూ.లక్షలు పెట్టుబడి తీసుకొచ్చి పొగాకు సాగు చేసి, ఇప్పుడు సరుకు అమ్ముడు పోక పోతే వ్యవసాయం పూర్తిగా మూల పడిపోతుందని అన్నారు. రైతులు, కౌలు రైతులు పూర్తిగా నష్టాల్లోకి కూరుకపోతారని అన్నారు. పొగాకు మొత్తం కొనుగోలు చేసే వరకు రైతులు ఐక్యంగా పోరా డాలని, పోరాటం ద్వారానే ఏదైనా సాధించగలమని చెప్పారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ పొగాకు కంపెనీల మాటలు నమ్మి రైతులు మోసపోయారని అన్నారు. మోసపు మాటలు చెప్పిన కంపెనీలు ఇప్పుడు మొఖం చాటేస్తున్నాయని అన్నారు. జిపిఐ కంపెనీ ఏజెంటు దొంగ చాటుగా వచ్చి రహస్యంగా రైతుల ఫోటోలు తీసి వారికి గేట్ పాసులు ఇవ్వకుండా ఉండేందుకు ప్రయత్నించగా రైతులు గమనించి ఏజెంట్ హర్షను పట్టుకొని నాయకుల ముందు ఉంచారు. అతని ద్వారా చిలకలూరిపేటలో ఉండే కంపెనీ మేనేజర్ ప్రసాద్‌తో తహశీల్దారు సింగారావు, నాగబోయిన రంగారావు సెల్ఫోన్ ద్వారా మాట్లాడారు. రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తం తక్షణమే కొనుగోలు చేయాలని, పంగులూరు, ఇంకొల్లు ప్రాంతంలో ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నాగబోయిన రంగారావు కోరారు. ఒక గోడౌన్‌లోని నల్ల బర్లి పొగాకు వర్షానికి ఏ విధంగా చెడిపోతుందో తహశీల్దారు సింగారావుకు చూపించారు. అనంతరం తహశీల్దారు సింగారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు, నాయకులు గుడిపాటి మల్లారెడ్డి, తలపనేని సుబ్బారావు, పోతుగంటి ఆదం సాహెబ్, నాయపాము ప్రభాకర్, అద్దంకి సుబ్బారావు, మద్దినేని సుబ్బరామయ్య, నాయపాము జాన్, ఉన్నం అంజయ్య, మాగులూరి చంద్రశేఖర్, వీరాంజనేయులు, గొర్రె వేణుబాబు, గోగుమళ్ళ సింగయ్య, పాలపర్తి ఓజ, బాచిన శేషగిరి పాల్గొన్నారు.

కారంచేడు : నల్ల బర్లి పొగాకు వెంటనే కొనుగోలు చేయాలని రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. గతేడాది ఇచ్చిన విధంగానే రేటు ఇవ్వాలని, పొగాకు వ్యాపారులపై ఒత్తిడి తెచ్చి పొగాకు కొనిపించాలని ఎపి రైతు సంఘం, కౌలు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నా ఉద్దేశించి కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పి కొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ మాటలు చెబుతూ కాలం గడుపుతుందని, ఇచ్చిన వాగ్దానాలు, చెప్పిన మాటలు ఏ ఒక్కటి నెరవేరడం లేదని అన్నారు. మాటలు చూస్తే కడుపు నిండుతున్నాయని, చేతలు చూస్తుంటే కడుపులు కాలుతున్నాయని అన్నారు. ఉప్పుటూరులో రైతులతో ముఖాముఖిలో స్థానిక ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నాబార్డ్ ద్వారా వెంటనే కొనుగోలు చేయించడానికి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పి 20 రోజులు గడిచిపోయిందని అన్నారు. ఈలోపు అప్పులు బాధ తట్టుకోలేక కూలీల కూలీడబ్బు కూడా ఇవ్వలేక రైతులు ఆత్మహత్యల మార్గం పట్టారని అన్నారు. అందువల్ల తక్షణ ప్రభుత్వం కదిలి నాఫెడ్ ద్వారా కొనుగోలు చేయించాలని, పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే కదిలి రైతులు వద్ద ఉన్న నల్లబల్లి పొగాకును వెంటనే కొనుగోలు ప్రారంభించాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దారు నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. పి ఏడుకొండలు, శ్రీనివాసరావు, ఆవులు మంద వెంకటేశ్వరరావు, పి శ్రీనివాసరావు, హనుమంతరావు, కంచర్ల రాజు, కటారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలో రైతులు పండించిన నల్ల బర్లీ పోగాకు ప్రభుత్వం పొగాకు బోర్డు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలైన మార్క్ ఫెడ్ ద్వారా కొనుకోలు చేయాలని కోరుతూ తహశీల్దారుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. పోగాకు పండించిన వారిలో ఎక్కువ మంది కౌలు రైతులు ఉన్నారని తెలిపారు. జిపిఐ, ఐటిసి, డక్కన్ లాంటి కంపేనీలు కోన లేదని, కౌలు, కూలీ రేట్లు ఎక్కువ ఉన్నా కష్ట పడి పండించిన పంట కొనక పోవడంతో రైతులు అప్పులుతో ఇబ్బంది పడుతున్నారని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు అన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.12500లకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈదల శ్రీను, కృష్ణరెడ్డి, వై హనుమంతరావు, గొట్టిపాటి వెంకటరావు, శేషాద్రి, రాజేష్, మధు బాబు, జివిఎస్ నాగేష్ పాల్గొన్నారు.

కారంచేడులో ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు పి కొండయ్య

తహశీల్దారుకు అర్జీ ఇస్తున్న రైతు నాయకులు బి హనుమంతరావు

ఇబ దంపతుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - అద్దంకి

పూజ చేస్తున్న ఇబ దంపతులు

సింగరకొండ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. స్వామి విమాన శిఖరానికి 108 కలిశాలతో మంగళవారం అభిషేకం వేద పండితులు, అర్చకులు, ముత్తైదువులు పాల్గొని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఇబ మదమంచి తిమ్మనాయుడు, రిషిత దంపతులు విమాన శిఖరానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు శిఖరానికి గుండ్లకమ్మ నది నుండి తీసుకువచ్చిన జలాలను విమాన శిఖరంపై వేద పండితులచే అభిషేకం జరిపారు.

రాఖీ ముఖ మండప దాతలకు ప్రత్యేక పూజ

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళాలు అందించిన దాతల దంపతులకు ప్రత్యేక పూజలు స్వామి వారి వద్ద నిర్వహించారు. అనంతరం స్వామి వారి చిత్రపటానికి కార్యనిర్వహణ అధికారి తిమ్మనాయుడు వారికి అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు, అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కలశ యాత్ర మహిళలకు ప్రత్యేక దర్శనం

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి కలశ పాదయాత్రలో గుండ్లకమ్మ నది నుండి సింగరకొండ వరకు పాదయాత్రలో పాల్గొన్న మహిళా భక్తులకు స్వామి వారి ప్రత్యేక దర్శనం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఏర్పాటు చేశారు. పాదయాత్రలో పాల్గొన్న మహిళా భక్తులు నియోజకవర్గం, ఇతర మండలాల నుండి వచ్చిన భక్తులకు విమాన శిఖర దర్శనం ఏర్పాటు చేసి స్వామి వారి దర్శనం అనంతరం అన్న వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

వధూవును ఆశీర్వదిస్తున్న ఆనందబాబు

వివాహ వేడుకల్లో ఆనందబాబు

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తోకలవానిపాలెం గ్రామంలో తెలుగుదేశం నాయకులు వీరంకి చిట్టిబాబు శకుంతల కుమార్తె మాధవి వివాహ వేడుకల్లో శాసన సభ్యులు నక్క ఆనందబాబు పాల్గొని నూతన వధువుకు ఆశీస్సులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తోకలవానిపాలెం సర్పంచ్ టి కృష్ణమోహన్, సుంకర శ్రీనివాస్, బుర్రె జగన్, గాదే చంటి, యడ్ల శ్రీనివాస్, మద్దూరి అజయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథరెడ్డి

'సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బాపట్ల

విద్యుత్తుకు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానళ్లు అమర్చుకునే విధంగా ప్రజలను చైతన్యం చేయాలని కమిషనర్ రఘునాథరెడ్డి సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా సోలార్ సిస్టం ద్వారా గృహాలకు ఏర్పాటు చేసుకునే ప్రత్యామ్నాయ విద్యుత్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఎంఎస్ఎంఈ రుణాల వసూళ్లు, మంజూరుపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌జి మహిళలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - అద్దంకి

ఒకే పని చేస్తున్న కార్మికులకు వేరువేరుగా జీతాలు ఇవ్వటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త కార్మిక సంఘాల పిలుపుతో స్థానిక మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం రోజు రోజుకి విస్తరిస్తున్నదని అన్నారు. జనాభా సంఖ్య పెరుగుతుందని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మున్సిపల్ వర్కర్ల సంఖ్య పెరగటం లేదన్నారు. దీనివల్ల కార్మికులపై పని భారం పెరిగి తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ప్రాంతాల్లోనూ పారిశుధ్య సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. దీంతో దోమలు పెరిగి అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. వీటన్నిటికీ పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచడమే పరిష్కారమని అన్నారు. రోజువారీ వేతన కార్మికులకు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందికి ఆప్కాస్ కార్మికుల వలె రూ.21వేల జీతం అమలు చేయాలని కోరారు. ఇంజనీరింగ్ విభాగం సిబ్బందికి మినిమం టైమ్ స్కేల్ వర్తింపు చేయాలని కోరారు. సర్వీసు పూర్తి చేసుకున్న పారిశుధ్య కార్మికులకు రూ.75వేల పారితోషకం తోపాటు తమ వారసులకు వారసత్వ పని హక్కు కల్పించాలని అన్నారు. ఏడాదికి మూడు జతలు బట్టలు ఇవ్వటంతో పాటు కుట్టు కూలీ నగదు కూడా ఇవ్వాలని అన్నారు. చనిపోయిన కార్మికులకు మట్టి ఖర్చుల కింద రూ.20వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ రూ.15వేలు మాత్రమే ఇస్తున్నారని, దీనిని రూ.20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రిస్క్ అలవెన్స్‌ల తోపాటు జాతీయ సెలవు దినాలను కూడా కార్మికులకు వర్తింపజేయాలని అన్నారు. చిరు జల్లులు పడుతున్నప్పటికీ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం బంగ్లా రోడ్డులోని అంబేద్కర్ బొమ్మ సెంటర్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి, బలరామిరెడ్డికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి ఆదాము, యూనియన్ అద్దంకి అధ్యక్షులు భీష్మ, శామ్యూల్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రకాశం పంతులకు నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రకాశం పంతులుకు ఘన నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

ప్రకాశం మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి సందర్భంగా స్థానిక బంగ్లా రోడ్డులోని టంగుటూరి పంతులు విగ్రహానికి పూల మాల వేసి మంగళవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు ముని మనవరాలు సుభాషిణి పంతులు విగ్రహానికి పూలదండ వేసి వారి నిస్వార్థ దేశభక్తి, త్యాగ నిరతి, ధైర్య సాహసాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రకాశం మిత్ర మండలి కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ, కోశాధికారి ఊటుకూరు రామకోటేశ్వరావు, సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకర్ దత్, రోటరీ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ వీరవల్లి సుబ్బారావు, అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళి సుధాకర్, కోశాధికారి మలాది శ్రీనివాసరావు, జాషువా కళా పీఠం పిసిహెచ్ కోటయ్య, జానపద కళాపీఠం ఉబ్బా దేవపాలన, పి రామచంద్రమూర్తి, మస్తాన్ మాస్టారు, నిమ్మరాజు నాగేశ్వరరావు, పాలపర్తి జ్యోతిష్మతి, ధర్మవరపు శ్రావణ్ కుమార్, సంకా సుబ్రహ్మణ్యం, తమ్మన శ్రీనివాసరావు, ప్రముఖ చిత్రకారుడు బాలు, అలహరి హరిబాబు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ

తహశీల్దారు కార్యాలయాల వద్ద నిరసన

ప్రజాశక్తి-చీమకుర్తి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంగులూరు కష్ణయ్య భవనం వద్ద నుంచి తహశీల్దారు కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ఉపయోగపడే విధానాలను వేగంగా అమలు చేస్తుందన్నారు. ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని, కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని విమర్శించారు. రోజురోజుకు నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని తెలిపారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకుడు పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ26,000 ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. అనంతరం తహశీల్దారు బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు పాటిబండ్ల పద్మ, బిందె ఆంజనేయులు, పి. ఏడుకొండలు రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బెజవాడ శ్రీనివాసరావు, క్రిష్టిపాటి చిన్నపరెడ్డి, కెవిపిఎస్ మండల కార్యదర్శి టి.రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శీలం ఆదినారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పొత్తూరి సురేష్, రైతు సంఘం మండల నాయకులు కొల్లూరి వెంకటేశ్వర్లు, పమిడి నరసింహారావు, నల్లూరి కష్ణయ్య, పి. జానీ పాల్గొన్నారు.

చీమకుర్తిలో నిరసన తెలుపుతున్న నాయకులు

నాగులుప్పలపాడు : రైతులు,కార్మిక,కర్షక, ఉపాధికూలీలు, భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్త నిరసనలో భాగంగా మండల పరిధిలోని ఉప్పుగుండూరు ,కండ్లగుంట,అమ్మనబ్రోలు గ్రామాల్లోని సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆవలంబిస్తున్న విధానాల కారణంగా రైతు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధరలేక అప్పులపాలై ఆత్మహత్యల వైపు దారితీస్తుందన్నారు. శనగ ,మిర్చి, పొగాకు, మినుము తదితర పంటలకు గిట్టుబాటు ధరలేక కొనే నాధుడు లేక రైతులు దివాలా తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు బర్లీ పొగాకు కొనుగోలు లేక కౌలు రైతులు కూలీలకు డబ్బులు ఇవ్వలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలపర్తి యోనా, రావెళ్ళ వెంకట్రావు ,ఎస్.కష్ణారావు, ఎన్.రామారావు, కె.చిరంజీ, వివిధ రంగాల కార్మికులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు : బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి

నాగులుప్పలపాడులో నిరసన తెలుపుతున్న నాయకులు

నుంచి ప్రకతి వనరులను కార్పొరేటర్లకు కట్టబెడుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు తెలిపారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ దేశంలో నెలకొన్న అనిచిత పరిస్థితుల వల్ల సార్వత్రిక సమ్మె వాయిదా పడినట్లు తెలిపారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రజల ప్రయోజనం కోసం ఏనాడు పోరాడలేదన్నారు. స్వాతంత్ర సమయంలో కూడా బ్రిటిష్ వారికి అనుకూలంగా పనిచేశారన్నారు. ప్రస్తుతం దేశంలో కార్పోరేట్ వ్యవస్థ వేగంగా పనిచేస్తుందన్నారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు కాశీం, ఆదిలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం మండల నాయకులు కనుపర్తి సుబ్బారావు, వెంకట్రామిరెడ్డి, కెవిపిఎస్ నాయకుడు కాకుమాను సుబ్బారావు, ఐద్వా నాయకురాలు అనంతలక్ష్మి, సుభాన్, విక్రమ్, నాగేశ్వరరావు, కృష్ణా రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 39 లేబర్ కోడ్‌లను కుదించి కార్మికులకు నష్టం కలిగించే విధంగా 4 లేబర్ కోడ్‌లు తీసుకురావడం అన్యాయమని సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా నాయకుడు వి.బాల కోటయ్య తెలిపారు. తహశీల్దారు కార్యాలయం వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకోటయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ లకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తుందని విమర్శించారు. సిఐటియు జిల్లా నాయకుడు టి. రాము మాట్లాడుతూ టోల్ ప్లాజా కార్మికులు పెండింగ్ ఇవ్వాలని 34 రోజులుగా నిరసన తెలుపుతున్న యాజమాన్యం పట్టించుకోక పోవటం దుర్మార్గమన్నారు. టోల్ ప్లాజా కార్మికులకు న్యాయం చేయాలని తహశీల్దారు ఆంజనేయులుకు అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ నేషనల్ హైఅధికారులతో మాట్లాడి టోల్ ప్లాజా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెపిపిఎస్ నాయకుడు వేసుపోగు మోజెస్, ఐఎఫ్‌టియు నాయకుడు టి. వెంకటరావు, ఎఐటియుసి నాయ కుడు టి. ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.సుబ్బారావు, టి.అంకయ్య, కాశీ, తిరు మలరావు, వసంతలక్ష్మి, కోదండం, నరసింహం పాల్గొన్నారు.

కొండపి : కౌలు రైతులకు బీమా పథకం అమలు చేసి బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని, భూమికి సంబందించిన నష్టపరిహారం వారికి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కెజి.మస్తాన్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందన్నారు. దాన్ని తిప్పి కొట్టాల్సిన అవసరం అందరిపై ఉందని తెలిపారు. ఉపాధి కూలీలకు రోజు వేతనం రూ. 600 ఇచ్చి 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు ఎం.పేతురు,రైతు సంఘం నాయకుడు జయరావు, సిఐటియు నాయకుడు గడ్డం వందనం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శామ్యూల్, లక్కపోగు కోటయ్య, కొండమ్మ, నరసింహా, యాకోబు, సింగారెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

కొండపిలో నిరసన తెలుపుతున్న నాయకులు



మద్దిపాడులో నిరసన తెలుపుతున్న నాయకులు

ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఇసుక రేవుల వద్ద అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు జరిపితే ఉపేక్షించేది లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు లేని వాహనాలు రేవు నుంచి బయటకు వెళ్లరాదన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూన్ నెల నుంచి ఇసుక తవ్వకాల నిషేధం అమలులోకి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రేవు నుంచి వాహనాలు వెళ్లే రహదారులను తొలగించాలని ఆదేశించారు. అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు

మాట్లాడుతున్న కలెక్టర్ వెంట మురళి

చేయాలన్నారు. ఆ వాహనాలను వెంటనే విడిచిపెట్టకుండా భారీగా జరిమానాలు విధించాలన్నారు. 2021 నుంచి 2024 వరకూ ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఏపీసాక్ నివేదిక ఆధారంగా జెపి వెంచర్స్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ప్రజల అవసరాల మేరకు ఇసుక రేవును నూతనంగా గుర్తించినట్లు తెలిపారు. జువ్వలపాలెం-2 ఇసుక రేవులో ఇసుక లభ్యత ఉందన్నారు. ఇక్కడ ఇసుక వినియోగం కోసం జిల్లాస్థాయి కమిటీ తీర్మానించి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు ప్రకటించారు. జువ్వలపాలెం-2 రేవులో 24.9 హెక్టార్లలో ఇసుక లభ్యత అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేవరకు ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం భట్టిప్రోలు ఇసుక రేవులో 12 వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. గాజుల్లంక ఇసుక రేవులో 19వేల మెట్రిక్ టన్నుల లభ్యత ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైన్స్ ఏడీ రాజేష్, డిటిఒ పరంధామ రెడ్డి, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి రాఘవేంద్రరావు, బాపట్ల, రేపల్లె ఆర్‌డిఒలు పి. గ్లోరియా, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నవాళులర్పిస్తున్న వైస్ ఛాన్సలర్ మూర్తి

ప్రకాశం పంతులుకు నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

స్వాతంత్ర్య సమర యోధులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, తెలుగుజాతి గర్వించదగిన మహానేత టంగుటూరి ప్రకాశంపంతులు నేటి తరానికి ఆదర్శప్రాయులని పలువురు పేర్కొన్నారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో ప్రకాశం పంతులు 68వ వర్థంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డివిఆర్. మూర్తి, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బి,హరిబాబు, యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. రాజ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నిర్మలామణి, సిడిసి డీన్ ప్రొఫెసర్ జి.సోమ శేఖర పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఈ క్రాప్ నమోదుతో సంబంధం లేకుండా ప్రభుత్వమే బర్లీ పొగాకును కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జుజ్జూరు జయంతి బాబు, పమిడి వెంకటరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న బర్లీ పొగాకు రైతులను గుర్తించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ నుంచి ఆదేశాల రావడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రాప్ ఆధారణంగా బర్లీ రైతుల నమోదు రైతులుకు శరాఘాతమని వారు పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కువ మంది కౌలు రైతులే బర్లీ పొగాకును సాగు చేసినట్లు తెలిపారు. భూ యజమానులు రైతులకు కౌలు రాసి ఇవ్వకపోవడం, అవగాహన లేకపోవడం లాంటి కారణాలతో అనేక మంది ఈ క్రాప్ నమోదు చేసుకోలేదని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా మిగిలిన పైర్లు గుర్తించిన విధంగా బర్లీ పొగాకు రైతులను గుర్తించి నమోదు చేయలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ క్రాప్‌తో నమోదు లేకుండా బర్లీ పొగాకు సాగు చేసిన రైతులందరినీ గుర్తించాలన్నారు. లేకుండా రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు, ఇతర సహాయం అందకుండా పోతుందన్నారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా బర్లీ సాగు చేసిన రైతులను గుర్తించి ప్రభుత్వమే కొనుగోలు చేయించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు జిల్లా విద్యాధికారి ఎ. కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన హిందీ 286 మందికి గాను 71 మంది మాత్రం హాజరు కాగా 215 మంది గైర్హాజరైనట్లు డిఇఒ తెలిపారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు 653 మందికి 511 మంది హాజరు కాగా 142 గైర్హాజరైనట్లు తెలిపారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి క్లస్టర్ పరిధిలోని కామేపల్లి గ్రామానికి చెందిన రైతులు 740 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 585 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 155 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట రూ.280, కనిష్ట రూ.200, సరాసరి ధర రూ. 254.62 పైసలు పలికినట్లు వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. పొగాకు వేలంలో 17 కంపెనీల ప్రనిధులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

మొక్కలు నాటుతున్న అధికారులు

మొక్కలు నాటిన అధికారులు

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని స్వర్ణ పంచాయతీ కార్యాలయ ముందు భాగంలో గ్రామస్తులు అందరూ చెత్తాచెదారం వేసి ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా చేయడంతో అధికారులు ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచి మొక్కలు నాటారు. స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసి మంచి వాతావరణం వచ్చే విధంగా చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు నాగరాజు, ఎంపిడిఒ నేతాజీ మాట్లాడుతూ గ్రామంలో చెత్తాచెదారం అంతా బహిరంగ ప్రదేశాల్లో వేయకూడదని చెప్పారు. పంచాయతీ పంపిణీ చేసిన చెత్త డబ్బాల్లో వేసి పంచాయతీ వాహనం వచ్చినప్పుడు ఆ వాహనాల్లోనే చెత్త వేయాలని చెప్పారు. దీనివలన పరిసరాలు, పంచాయితీ పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుబాబు, కార్యదర్శి చక్రవర్తి, నాయకులు తిరుమలశెట్టి శ్రీహరి పాల్గొన్నారు.

శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

నిరుద్యోగులకు స్కిల్ హబ్‌లో శిక్షణ

ప్రజాశక్తి - రేపల్లె

స్కిల్ హబ్ సెంటర్ నందు వెబ్ డెవలపర్, అకౌంట్స్ కోర్సుల శిక్షణ ప్రారంభించినట్లు ఎబిఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టిసి రవి చంద్రకుమార్ తెలిపారు. ఎపి రాష్ట్ర నైపుణ్యాబివృద్ధి సంస్థ తమ కళాశాల నందు నిరుద్యోగ అభ్యర్థులకు ఈ స్కిల్ హబ్ సెంటర్ నందు పరిశ్రమలకు అనుగుణంగా శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డిసి), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) నుండి ధృవీకరణ పత్రం అందజేసి అర్హతలను బట్టి అభ్యర్థులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 18 నుండి 35 ఏళ్ల వయస్సు కలిగి ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ, ఆపైన చదివిన స్త్రీ, పురుష అభ్యర్థులు శిక్షణకు అర్హులని తెలిపారు. వెబ్ డెవలపర్, అకౌంట్స్‌లో మూడు నెలల శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ లింక్ నందు అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. https://forms.gle/F6UGfdS3qmJw6rGZ6 Or https://rb.gy/r4anoo మరిన్ని వివరాలకు 93474 68946 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

కరెంట్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాశక్తి - యద్దనపూడి

సుబ్బాయమ్మ (60)

మండలంలోని యనమదల గ్రామంలో ఎంఎస్ఆర్ రైస్ మిల్లు వద్ద ఉంటున్న మేడిశెట్టి సుబ్బాయమ్మ (60) కరెంట్ షాక్‌తో మంగళవారం మృతి చెందారు. కటారువారి పాలెంకు చెందిన ఆమె గత 8ఏళ్ల నుండి కుటుంబంతో యనమదలలో ఉంటుంది. ఉదయం ఇంటి నుండి బయటకు వెళుతూ కరెంట్ తీగ తగిలి చనిపోయారు. ఇంటి ఎదురుగా ఉన్న పల్లపు వెంకటేశ్వర్లు మృతురాలు పడి ఉండగా చూసి ఏమి అయిందోనని తాకగా అతనికి కూడా షాక్ తగిలి గాయమైంది. అతనికి మూడు కుట్లు పడట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు వెంకాయమ్మ, కృష్ణవేణి, కుమారుడు రాంబాబు, కోడలు రూప, ఇద్దరు మనుమలు, అళ్ళుల్లు ఉన్నారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. యద్దనపూడి ఎస్ఐ రత్న కుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సిబ్బంది రాములు నాయక్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి : సిఐటియు

బస్టాండ్ వద్ద నిరసన తెలియజేస్తున్న సిఐటియు నాయకులు

రేపల్లెలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - చీరాల

కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులు హరించే విధంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం వసంతరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మునిసిపల్ కార్మికులతో సిఐటియు ఆధ్వర్యంలో లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి దారీ ప్రయోజనాల కోసం 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందని అన్నారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీ మరింత పెంచుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు. అక్రమ తొలగింపులు, పని భారాన్ని పెంచే విధంగా పని గంటలు పెంచడానికి లేబర్ కోడ్స్ తెచ్చిందని అన్నారు. పెట్టుబడిదారులకు ఉద్యోగులు, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా ఈ చట్టాలు ఉన్నాయని అన్నారు. కార్మికుల జీవన్మరణ సమస్యగా ఉన్నలేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలని అన్నారు. జులై 9కి వాయిదా పడిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబురావు, నాయకులు గోసాల సుధాకర్, క్రాంతి సాగర్, సురేష్, చింత శ్రీనివాసరావు, నాగమ్మ, సునీత, వెంకటేష్ పాల్గొన్నారు.

రేపల్లె : కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న ప్రమాదకరమైన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ అన్నారు. లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చడం కోసం ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయటానికి ప్రయత్నిస్తుందని అన్నారు. అవి అమలైతే స్వాతంత్రం పూర్వం నుండి కార్మికులకు అమలువుతున్న సమ్మెహక్కు, 8 గంటల పని విధానం, పిఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనాలు, పరిశ్రమల్లో కార్మిక శాఖ అధికారుల పర్యటనలు రద్దవుతాయని అన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే చట్టాలు అమలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. దేశంలో కార్మిక, రైతాంగం, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త సమ్మెకు కార్మికవర్గం సిద్ధమైందని అన్నారు. దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా సమ్మెను జూలై 9కి వాయిదా వేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో దేశవ్యాప్త కార్మికవర్గాన్ని కలుపుకొని హక్కులు కాపాడుకోవడానికి పెద్దఎత్తున ఆందోళన కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె ఆశీర్వాదం, కె రమేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు డి ప్రభాకరరావు, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు వై వాసు, పి విజయ్, కె వెంకటేశ్వరరావు, ఆర్టీసీ హైర్ బస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాపట్ల : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా పాత బస్టాండ్ సెంటర్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె శరత్ మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు. జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాలు రద్దు చేయాలని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు కార్మికుల శ్రమను దోచి పెట్టేందుకే పాలకులు లేబర్ కోడ్‌లను తీసుకువస్తున్నారని అన్నారు. కార్మికులు ప్రాణ త్యాగతం చేసి సాధించుకున్న హక్కులను కార్పొరేట్ల మెప్పుకోసం బిజెపి పాలకులు తాకట్టు పెడుతుంటే కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బుచ్చిరాజు, సిఐటియు పట్టణ అధ్యక్షులు ఓ లక్ష్మణ, బ్రహ్మం, వలి, మూర్తి పాల్గొన్నారు.

అమృతలూరు : కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు చేసి వాటిస్థానంలో యజమానులకు అనుకూలమైన 4 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చున్న వాటిని రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి బి అగస్టిన్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలు కాపాడాలని కోరారు. కార్మికులను బానిసత్వంలోకి నెట్టే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రంగ సంస్థల ప్రవేటికరణ ఆపాలని, కనీస వేతనం అమలు చేయాలని, స్కీమ్ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం స్కీం వర్కర్స్‌కు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జులై 9న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి ధనలక్ష్మి, హాఫిజాన్, సునీత, శ్రీలత, సరిత, రోజామణి, ఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న అఖిల భారత సమ్మె జయప్రదం చేయాలని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కోరారు. 20న జరగాల్సిన సమ్మె జులై 9కి వాయిదా పడటంతో 20న దేశవ్యాప్తంగా నిరసన తెలియచేయాలని పిలుపు ఇవ్వడంతో పంచాయతీ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల సంఘాల నాయకులు మురుగుడు సత్యనారాయణ, పి మనోజ్ కుమార్, గోళ్ళ నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు దీపాల సత్యనారాయణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సీతామాలక్ష్మి, శ్రీను, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అమృతలూరులో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

బాపట్లలో నిరసన తెలుపుతున్న సిఐటియు, కార్మికులు

భట్టిప్రోలులో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

చైతన్యంతో బాల్య వివాహాలు నిరోధించాలి

మాట్లాడుతున్న రేపల్లె సిడిపిఒ సుచిత్ర

ప్రజాశక్తి - రేపల్లె

ఐసీడీస్ ప్రాజెక్ట్ పరిధిలో కిషోర వికాసం వేసవి కాంపెయిన్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ సుచిత్ర మాట్లాడుతూ బాలల హక్కులు, సంరక్షణ, సంరక్షణ మధ్య ఉన్నా వ్యత్యాసం గురించి వివరించారు. పేదరికం, అనారోగ్య పరిస్థితుల్లో వున్న వారికి వారి హక్కులు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలు నివారించాలని చెప్పారు. బాలికల పోషణ, బాలికల రక్షణ అంశాలపై శిక్షణ ఇచ్చారు. పాటలు, డాన్సులు, నాటక రూపంలో అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ చదువుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ శివజ్యోతి, మహిళాసంరక్ష కార్యదర్శి బి హరిత, ఆషా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

వేమూరు : నియోజకవర్గంలోని చుండూరు మండలం మోదుకూరు సెక్టార్ పరిధిలోని అంబేత్కర్ నగర్లో కిషోర్ వికాసం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ పెరికల నాగరాజా కుమారి మాట్లాడుతూ కిశోర బాలికలు బలమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సద్వినియోగ చేసుకోవాలని అన్నారు. కిషోర్ వికాసం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమంలో కిశోర బాలికలు పాల్గొని వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు ఉన్నారు.

కిషోర బాలికలతో సూపర్వైజర్ నాగరాజ కుమారి

22న ఇంకొల్లులో బర్లీ పొగాకు రైతుల సదస్సు

ప్రజాశక్తి - పంగులూరు

ఈనెల 22న గురువారం సాయంత్రం 3గంటలకు ఇంకొల్లులో నల్లబర్లీ పొగాకు రైతుల సదస్సు జరుగుతుందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలుపనేని రామారావు మంగళవారం తెలిపారు. ఈ సదస్సుకు మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రిశ్వరరావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బర్లీ పొగాకు రైతుల ప్రదర్శన, సదస్సు జరుగుతుందని అన్నారు. ఇంకొల్లు, పంగులూరు, పర్చూరు, కారంచేడు, మార్టూరు మండలాల పరిధిలోని బర్లీ పొగాకు రైతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఇంకొల్లు : ఈనెల 22న మాజీ మంత్రి, రైతు నాయకులు వడ్డే శోభనాదీశ్వరరావు పొగాకు రైతులను పరామర్శం చేందుకు ఇంకొల్లు వస్తున్నట్లు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామకోటేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలో నల్లబర్లి పొగాకు సాగు చేసి అమ్ముడు పోకుండా నష్టపోతున్న రైతులను కలిసేందుకు వస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రైతులతో ముఖాముఖి నిర్వహించి అనంతరం రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుక వెళ్లనున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
బుధవారం 21 మే 2025

రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ తమీమ్అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

క్షేత్రస్థాయిలో ఎలాంటి పెండింగ్ లేకుండా రెవెన్యూ సమస్యలు సత్వరం పరిష్కరించేలా కృషి చేయాలని కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణతో కలసి రెవెన్యూ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చిన అర్జీల పరిష్కారం, జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ, భూ అప్పగింత, రీ సర్వే, రెవెన్యూ సర్వీసులు, వాటర్ టాక్స్ తదితర అంశాలపై రెవెన్యూ డివిజనల్ అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మంజూరు కాబడిన లేదా ప్రతిపాదించిన వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ, భూ అప్పగింత ప్రక్రియ త్వరగా పూర్తి చేసేలా మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని పనిచేయాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను నిశితంగా పరిశీలించి అర్థం చేసుకొని నాణ్యతతో పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీల పరిష్కారానికి సంబంధించి ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేసిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సక్రమంగా ఎండార్స్‌మెంట్ చేశారా లేదా పరిశీలన చేయాలని చెప్పారు. ప్రతి వారం రెవెన్యూ అంశాలపై వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి తహసిల్దార్లతో మాట్లాడుతూ అర్జీల పరిష్కారినికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించు కునే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అన్నారు. రెవెన్యూ చట్టాలు, రెవెన్యూ అంశాలపై రెవెన్యూ అధికారులు పూర్తి అవగాహనతో పని చేయాలని అన్నారు. రెగ్యులరైజేషన్ స్కీం 2025 ప్రక్రియపై ఆర్‌డిఒలు ప్రత్యేక దృష్టి సారించి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో వాటర్ ట్యాక్స్ వసూలుపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇళ్ల పట్టాల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. భూముల రీ సర్వే ప్రక్రియ రెవెన్యూ శాఖలో అతి ముఖ్యమైన అంశం అన్నారు. ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం వహించకుండా రీ సర్వే పూర్తయ్యేలా దృష్టి సారించాలని అన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వక క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు తయారు చేసి పంపాలని అన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డిఒలు లక్ష్మిప్రసన్న, వెంకట శివరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు వరకుమార్, సత్యనారాయణ, శ్రీధర్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్డీవో లక్ష్మీప్రసన్నతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

వర్షానికి మిరప, పొగాకు రైతుల అగచాట్లు

ప్రజాశక్తి - ఇంకొల్లు

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్లాల్లో మిరప కాయలు ఉన్న రైతులతోపాటు పందిరిపై ఉన్న పొగాకు తాళ్లతో రైతులు అనేక అగచాట్లు పడుతున్నారు. చివరి దశలో కోతకోసిన మిరప కాయలు కొంత మంది రైతులకు చెందినవి మండలంలోని వివిధ గ్రామాల్లో కొన్ని కల్లాల్లోనే ఆరబోసి ఉన్నాయి. లేత పొగాకు చేలు, బర్లీ పొగాకు కొట్టి తాళ్లు కట్టి అక్కడక్కడ ఉన్నాయి. అయితే ఈ ఏడాది నవంబర్లో కురిసిన వర్షాల తర్వాత డిసెంబర్ నెలలో అక్కడక్కడ మండలంలో చెదురు, ముదురు జల్లులు తప్ప రైతుల పంట నష్ట పోయే వర్షాలు పెద్దగా పడలేదు. గత నాలుగు రోజులుగా ప్రతిరోజు ఏదో ఒక సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవటంతో పాటు, ఆకాశం మేఘావృతమై చల్లగా ఉంటుంది. దీంతో పొగాకు పని చేసిన రైతులతో పాటు కల్లాల్లో మిరప కాయలున్న రైతుల అగచాట్లు వర్ణాతీతం. ప్రతిరోజు వర్షం పడే సమయంలో పరదాలు కప్పటం, తరువాత ఎండ వచ్చినప్పుడు కప్పిన పటలు తీయడం పనిగా మారింది. ఇలా గత నాలుగు రోజులుగా ప్రతిరోజు వాతావరణం ప్రభావంతో కల్లాల్లో, కువ్వబోసిన మిరపకాయలు ప్లాస్టిక్ పట్టాల కింద మగ్గి ఆవిరి ఎక్కి, బూజు పట్టి పాడైపోతున్నాయి. పండిన పొగాకు పంట నిల్వ చేసుకోవటానికి సరైన వసతి లేక ఆరు బయట మండేలు కట్టి ప్లాస్టిక్ పట్టలు కప్పిన రైతులు ఈ వర్షాని కి ఇబ్బంది పడుతున్నారు. అడుగుభాగాన నీరు చేరి తేమకు తాళ్లు బూజుబడతాయని రైతులు వాపోతున్నారు. పందిరిపై ఉన్న పొగాకు తోపాటు పూర్తిగా ఎండీ ఎండకుండా మండెలు వేసిన తేమ ఉన్న పొగాకు మండేలు సైతం వర్షానికి పట్టలు కప్పటం వలన బూజు వస్తూ రంగు మారుతుంది. ఇలా చేయటం వలన మిరపకాయలు గుల్ల గాయాలుగా మారటంతో పాటు, పొగాకు రంగు మారి నాణ్యత తగ్గి పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అసలే ఈ ఏడాది పొగాకు కొనేవారు లేక కంపెనీలు పేచీలు పెడుతున్నాయి. దీంతో ఈ తడిసిన పోగాకు కంపెనీలు అసలు కొంటాయా కొనరా? అన్నఆందోళనలో రైతులు ఉన్నారు. మిరప కాయల ధరలు పూర్తిగా పడిపోయినవి. దీంతో ఈ కాయలు కోతకూలికి కూడా రావని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణ శాఖ మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించడంతో రైతులు వాటిని కాపాడుకోలేక అగచాట్లు పడుతున్నారు.

ఇంకొల్లు కల్లాల్లో తడిసిన మిరపకాయలు

గ్రంధాలయ స్థలం కొలతలు తీస్తున్న దృశ్యం

గ్రంథాలయ సంస్థకు స్థలం అప్పగింత

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణ ప్రజల కోరిక మేరకు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో అద్దంకి గ్రంధాలయానికి స్థలం కేటాయింపు చేయగా తహశీల్దారు జి చరణ్ రెవెన్యూ సిబ్బందిచే స్థానిక ఎన్ఎస్పి కార్యాలయంలో కేటాయించిన 10 సెంట్లు కొలతలతో అప్పగించారు. అందుకు గ్రంధాలయ శాఖ అధికారులు హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ స్థలం విషయంలో చొరవ చూపిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ భవన నిర్మాణ విషయంలో కూడా ఆయన సహకారంతో, ఆయన ఆదేశాల మేరకే ముందుకెళ్తామని అన్నారు. సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకర్ దత్తు మాట్లాడుతూ విద్యతో సాధించలేనిదేదీ లేదని అన్నారు. పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, డాక్టర్ యు దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ లైబ్రేరియన్ సిహెచ్ సుగుణరావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పల్లెపాటి పేరయ్య, గోవాడ శ్రీకాంత్, చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఉపాధ్యాయ ఉద్యోగాలకు డీఎస్సీకి సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులు అత్యధికంగా ఉత్తీర్ణత సాధించే దిశగా ఉచిత శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ రీజనల్ ప్రాజెక్టు డైరెక్టర్ బాచిన పద్మావతి అన్నారు. రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ, స్థానిక భావపురి విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత డీఎస్సీ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న డీఎస్సీ ఎస్జీటి సెకండరీ గ్రేడ్ టీచర్స్, ఎస్ఎ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఉచిత పరీక్ష సామాగ్రి మంగళవారం పంపిణీ చేశారు. అభ్యర్థులకు అవగాహన జాగృతి ద్వారా ప్రతి రోజూ పాఠ్యాంశాలు చాప్టర్ వైజ్ టెస్ట్, వీక్లీ టెస్టులతో పాటు కరెంట్ అఫైర్స్, జీకే, సైన్స్ అండ్ టెక్నాలజీ, కంటెంట్, విద్యా దృక్పదాలు, సైకాలజీ క్లాస్లో టీచర్ బోధన జరిగిన తర్వాత నోట్స్ మెటీరియల్స్ అధ్యయనం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రిన్సిపల్ ఆవుల వెంకటేశ్వర్లు, బోధన సభ్యులు శర్మ, సంజీవ్, శ్రీనివాసరావు, నారాయణ, అశోకరాణి, వీరాస్వామి, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత మెటీరియల్ అందిస్తున్న నిర్వాహకులు

'గొర్రెపాటి'కి నివాళులర్పించిన అశోక్‌బాబు

ప్రజాశక్తి - వేమూరు

నియోజకవర్గంలోని చుండూరు గ్రామానికి చెందిన వైసిపీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరెడ్డి తండ్రి గొర్రెపాటి వేమారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు పూల మాల వేసి నివాళులర్పించారు. వేమారెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వేమారడ్డి మృత దేహానికి పూలమాల వేస్తున్న అశోక్ బాబు

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలులో గత కొన్నేళ్లుగా హైటెక్ కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించి అనేక మందికి కంప్యూటర్ పట్ల అవగాహన కల్పించిన భూపతి రమేష్ బాబు (హైటెక్ రమేష్) (58) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన గత కొన్ని రోజులుగా గుండె జబ్బుకు గురై స్టంట్ వేయించుకున్నారు. అయినప్పటికీ తగ్గకపోవడంతో ఇటీవల గుండెకు బైపాస్ సర్జరీ చేశారు. సర్జరీ చేసిన మూడు రోజులకే మృతి చెందారు. ఆయన గత కొన్నేళ్లుగా ఎంఆర్ఆర్ ఎవిఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. అందరికీ సుపరిచితుడైన రమేష్ అకాల మరణం పట్ల పలువురు నాయకులు, అధికారులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుని సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రమేష్ బాబు (ఫైల్)

రేషన్ డెలివరీ వాహనాల రద్దు పట్ల హర్షం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రేషన్ డెలివరీ వాహనాల రద్దు చేయడం పట్ల ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని రేషన్ డీలర్ల సంఘ నాయకులు టి రవిచంద్రరెడ్డి, నాగుల పున్నారావు తెలిపారు. మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో జూన్ నుండి రేషన్ డీలర్ల వద్ద నుండి బియ్యం, నిత్యవసర వస్తువల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు. ఇన్ని రోజుల నుండి రేషన్ డీలర్ల ఆత్మ గౌరవాన్ని దెబ్బ కొట్టే విధంగా రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని, ఎండియు వ్యవస్థ రద్దు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా డీలర్లు కృషి చేస్తారని తెలిపారు.

53 మంది విద్యార్థుల గైర్హాజరు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 2వ రోజు కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. 2వ రోజు హిందీ పరీక్ష నిర్వహించగా రెండు కేంద్రాల్లో కలిపి 57 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 35 మంది విద్యార్థులకు ముగ్గురు విద్యార్థులు, గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 22 మంది విద్యార్థులకు ఒకరు మాత్రమే హాజరయ్యారని ఎంఈఓ పులి లాజర్ తెలిపారు.

మాట్లాడుతున్న ఫిజియోథెరపీ వైద్యులు

ఫిజియోథెరపీపై అవగాహన

ప్రజాశక్తి - పంగులూరు

మండల పరిషత్ కార్యాలయంలో హైదరాబాద్‌లోని నిజాం ఫిజియోథెరపీ ఇనిస్టిట్యూషన్ ద్వారా ఫిజియోథెరపీ పరికరాలతో ఫిజియోథెరపీపై ఉచిత అవగాహనా వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ క్యాంపు వివిధ కారణాల వలన ఏర్పడు నొప్పులకు, ఇతర ఇబ్బందులకు తీసుకోవాల్సిసిన జాగ్రత్తలను ఫిజియోథెరపీ వైద్యులు వివరించారు. ఫిజియో థెరఫీ ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. శారీరక వైకల్యం ఉన్న వారికి ఫిజియో థెరఫీ చేయడం ద్వారా ఎంతో ప్రయోజనం ఉంటుందని చెప్పారు. క్యాంపు ఏర్పాటు ఆవశ్యకతను ఎంపిడిఒ కె స్వరూపరాణి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె సుమంత్, కార్యాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటిన కాజీపేట ఎడ్ల జత

ప్రజాశక్తి-పిసిపల్లి

ఈనెల 22న హనుమాన్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని పాలేటి గంగమ్మ గుడి ఆవరణ వద్ద 36 అడుగుల అభయాంజనేయ స్వామి దేవస్థానం నిర్వాహకులు కొంపల్లి మాలకొండ ఆధ్వర్యంలో మంగళవారం ఎడ్లకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో కాజీపేటకు చెందిన ఇరగంరెడ్డి లక్ష్మిరెడ్డి, తనుబొద్ది రవిశంకర్ రెడ్డి చెందిన ఎడ్ల జత 5113.3 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.50,116 నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి. దర్శికి చెందిన గరికపాటి వెంకట్ ఎడ్ల జత 5002.7 అడుగులు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 40,116 నగదు బహుమతిని సాధించాయి. తెలంగాణాకు చెందిన జక్కుల సహస్ర యాదవ్, డాక్టర్ హుస్సేన్ ఎడ్ల జత 4838.8 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ. 30.116 నగదు బహుమతిని అందుకున్నాయి. గరికపాటి లక్ష్మయ్య చౌదరి, నుసుం బైపిరెడ్డి కి చెందిన ఎడ్ల జడ 4,806.8 అడుగులు తృతీయ స్థానంలో నిలిచి 20,116 నగదు బహుమతిని అందుకున్నాయి.ఈ పోటీలకు వ్యాఖ్యాతగా కొండు వెంకటరామిరెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మల్లికార్జున, కొంపల్లి మధు, గుడెనాగేశ్వరరావు, వేమూరు సుబ్బారావు ,వెలిది మాలకొండయ్య గుంటూరు జిన్నర్స్ కాటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వేమూరు నరసింహారావు , మల్లెల కొండలు, మానుకొండ నర్సాయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

పంట కాలువలు, డ్రైన్ల మరమ్మతులు

సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పంట కాలువలు, డ్రైన్ల మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. నీటిపారుదల శాఖ, డ్రైనేజీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులనుకలెక్టర్ వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మంగళవారం తనిఖీ చేశారు. తొలుత జిల్లెలమూడి గ్రామం లోని నల్లమడ వాగులో కోతకు గురైన కరకట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. నల్లమడ వాగులో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని,వాగు విస్తీర్ణం పెంచాలని ఆయన అధికారులకు సూచించారు. నల్లమడ వాగు విస్తీర్ణతకు కావాల్సిన భూమి కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని బాపట్ల, రెవెన్యూ డివిజన్ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం బాపట్ల జిల్లాకు నీటి సరఫరా చేసే పిటి ఛానల్‌ను తనిఖీ చేశారు. ఛానల్ నుంచి నీటి సరఫరా నిలుపుదల చేసినందున ఛానల్లోని ఇసుక మేటలను తొలగించాలని అధికారులను కోరారు. బాపట్ల కు చెందిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లోని పూడికలను తొలగించి, ట్యాంక్ విస్తీర్ణాన్ని పెంచి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. అందుకు ప్రతిపాదన తయారు చేయాలని నీటిపారుదల శాఖ ఎస్ఇకి జిల్లా కలెక్టర్ సూచించారు. బాపట్లకు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుంచి నీటి సరఫరాను 35 రోజులు నుంచి 60 రోజులకు పెంచాలన్నారు. అనంతరం నరసాయపాలెం లోని చెరుకూరు ట్యాంక్ ఛానల్లోని గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులను కలెక్టర్, బాపట్ల ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం నల్లమడ వాగు లాకులను పరిశీలించారు. వాగు లాకుల గురించిన వివరాలను నీటిపారుల శాఖ ఎస్ఇని అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఇ వెంకటరత్నం, డ్రైనేజీ శాఖ ఇఇ మురళీకృష్ణ, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి. గ్లోరియా, బాపట్ల తహశీల్దారు సలీమా, నీటిపారుదల శాఖ, డ్రైనేజీ శాఖలకు చెందిన డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

నల్లమడ వాగును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

నల్లమడ లాకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల కెప్టెన్ల ధర్నా

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో పనిచేస్తున్న కెప్టెన్ల (డ్రైవర్లు)గా సమస్యలకు పరిష్కారం చూపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ కార్యదర్శి వి.ఆర్. గంగయ్య అధ్యక్షతన కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటనపల్లి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు, జివి. కొండారెడ్డి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంట్యాల కల్పన పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. అనంతరం గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ కేవలం రూ.7,870 వేతనంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో పని చేయించుకోవడం దారుణమన్నారు.కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్‌సోర్స్ విధానం పేరుతో రాష్ట్రంలో వెట్టిచాకిరీ విధానం అమలు అవుతుందని ఆరోపించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంట్యాల కల్పన మాట్లాడుతూ తల్లి బిడ్డ వాహన కెప్టెన్లకు ఉద్యోగ భద్రత కల్పించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈయూనియన్ ఉపాధ్యక్షుడు గుంటి వెంకటేశ్వర్లు, నాయకులు భరత్ కుమార్ మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా రూ.7,870 వేతనంతో బతుకుతున్న తమ సమస్యలకు పరిష్కారం చూపా లన్నారు. పెరిగిన నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులతో తమకు వచ్చే వేతనంతో ఎలా జీవించాలని ఆయన ప్రశ్నించారు. కనీస వేతనం రూ.18,500 అమలు చేయాలని కోరారు. ఇఎస్ఐ, పిఎఫ్ సదుపాయం కల్పించాలని, వారంతపు సెలవులు అమలు చేయాలని,ఆరోగ్య బీమా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ధర్నా నిర్వహిస్తున్న తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల కెప్టెన్లు

విమానాశ్రయం భూములు పరిశీలన

ప్రజాశక్తి - దొనకొండ

దొనకొండ విమానాశ్రయానికి చెందిన భూములను గన్నవరం ఎయిర్‌పోర్టు సివిల్ ల్యాండ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మోహన్ బృందం మంగళవారం పరిశీలించారు. విమానాశ్రయం ఇన్‌ఛార్జి రామకృష్ణ విమానాశ్రయానికి చెందిన నలుదిక్కుల హద్దులను, హెలిప్యాడ్, చుట్టూ పెన్సింగ్‌ను చూపించారు. దొనకొండ విమానాశ్రయానికి చెందిన భూమి ఎయిర్‌పోర్టు అథారిటీ పేరుమీద మ్యుటేషన్ చేయించేందుకు, చుట్టూ పెన్సింగ్ ఏవిధంగా ఉంది, భూమి ఆక్రమణకు గురైందా తదితర సమాచారం తెలుసుకునేందుకు పరిశీలన వచ్చినట్లు ఈ సందర్భంగా మోహన్ తెలిపారు.

భూములను పరిశీలిస్తున్న అధికారులు

ఆర్‌టిసి గారేజీలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలు ఆర్‌టిసి డిపో గారేజీలో రీజనల్ మేనేజర్ జి. సత్యనారాయణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ మరమ్మతులు చేస్తున్న వాహనములను పరిశీలించారు. ఏ రోజు మెయింటెన్ చేయాల్సిన వాహనాలు అదే రోజు మెయింటెన్ చేసేలా చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్ సత్యనారాయణ, సిబ్బందికి సూచించారు. మెయింటెన్ చేసిన వాహనాలను డిపో మేనేజరు, కార్మికులతో కలిసి రోడ్ టెస్ట్ నిర్వహించి, బస్సు కండిషన్ స్వయంగా పరిశీలించారు. బ్రేక్ డౌన్ ఫ్రీ శుభ్రత, భద్రత విషయాలలో తగు జాగ్రత్తలు పాటించాలని గ్యారేజ్ సిబ్బందికి సూచించారు.

మార్క్‌ఫెడ్ ద్వారా

నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలి : ఏలూరి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మార్క్ ఫెడ్ ద్వారా నల్లబర్లీ కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. టొబాకో బోర్డు ఛైర్మన్ సిహెచ్.యశ్వంత్ తో ఎమ్మెల్యే ఏలూరి మంగళవారం భేటీ అయ్యారు. నల్లబర్లీ పొగాకును కంపెనీలు కొనుగోలు చేయకపోవడంపై ఎమ్మెల్యే ఏలూరి ఇటీవల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తో భేటీ నిర్వహించి పొగాకు కంపెనీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అయినప్పటికీకంపెనీలు పొగాకు కొనుగోలు చేయలేదు. దీంతో ఎమ్మెల్యే ఏలూరి పొగాకు కంపెనీలపై ప్రభుత్వంతో వివిధ మార్గాల ద్వారా ఒత్తిడి తీసుకొస్తున్నారు. పొగాకు సమస్యపై ఎమ్మెల్యే ఏలూరి రూపొందించిన ఒక ప్రత్యేక నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ అంశంపై మంత్రుల క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోలుకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే ఏలూరి పొగాకు బోర్డు ఛైర్మన్‌తో భేటీ నిర్వహించారు. పంట ఉత్పత్తులకు సంబంధించి కీలక నివేదికను అంద జేయడంతో పాటు, ప్రాసెసింగ్ యూనిట్లు, వాటి కెపాసిటీ, గతంలో మార్కెట్ ఎగుమతులు, వాణిజ్యానికి సంబం ధించిన విషయాలపై నిశితంగా చర్చించారు. పొగాకు బోర్డుకు సంబంధించిన డేటాను సేకరించారు. ఆ డేటాతో పాటు తన ఉన్న నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ క్యాబినెట్ కమిటీ సమావేశంలో పొగాకు కొనుగోలు కు సంబంధించి కంపెనీలకు కొంత సమయం ఇచ్చి చూద్దామని, తర్వాత ఏం చేయాలో నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నట్లు తెలిపారు. రైతులకు న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.

పొగాకు బోర్డు చైర్మన్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే ఏలూరి

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -చీమకుర్తి

మండల పరిధిలోని పి.నాయుడుపాలెంలో జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గ్రామ మాజీ సర్పంచి కూరాకుల కరుణాకర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన యువతను అభినందించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి ఇస్తర్ల ఏడుకొండలు, నాయకులు అలుగొండ శ్రీనివాసరెడ్డి, గొర్రె మస్తు తిరుపతిస్వామి, తొరటి కోటయ్య, అత్యలగంగయ్య, టి.రోశయ్య పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కరుణాకర్‌రెడ్డి